## ఒంగోలులో వజ్రప్రహార్ ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు

**- బాలాజీ నగర్‌లో పోలీసులు భారీ సోదాలు కార్డన్ సెర్చ్‌లో వాహనాల స్వాధీనం**

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు నగర ప్రజల శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పోలీసులు 'ఆపరేషన్ వజ్రప్రహార్' చేపట్టారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాలాజీ నగర్ మరియు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8 మంది ఎస్సైలు, 42 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 12 బైక్‌లు, 6 ఆటోలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రజలకు మాదకద్రవ్యాల ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ గంజాయి వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆర్థిక, కుటుంబ సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. అక్రమ రవాణా, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రతపై కూడా సూచనలు ఇస్తూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మవద్దని హెచ్చరించారు. అనంతరం పోలీసులు ర్యాలీ నిర్వహించి ప్రజలతో కలిసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 లేదా పోలీస్ వాట్స్‌అప్ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

## ఫిట్ ఇండియాలో సైక్లింగ్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**




ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా పోలీస్‌లు ఆదివారం"ఆదివారాలు సైకిల్‌పై" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా సైక్లింగ్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఆధునిక జీవనశైలిలో వాహనాల వినియోగం పెరగడంతో వ్యాయామం తగ్గిపోతుందని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని అధికారులు తెలిపారు. రోజూ కొంత సమయం సైక్లింగ్ చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది విధుల ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శక్తి, స్థైర్యం పెరిగి ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించగలమన్నారు. రోజువారీ ఒత్తిడిని తగ్గించేందుకు వ్యాయామం కీలకమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణారెడ్డి, ఆర్ ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ఉలవపాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**




నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 70వ జన్మదినం పురస్కరించుకొని ఆదివారం కరేడు గ్రామంలోని వీపీఆర్ ఫౌండేషన్ అమృత ధార వద్ద భారీ కేక్ ను కట్ చేశారు. అదేవిధంగా కరేడు బస్టాండ్ వద్ద ఉన్న చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కరేడు గ్రామ తెదేపా అధ్యక్షుడు నేలటూరి ఆదాము, మెట్ట శ్రీనివాసరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సుంకర చెంచురామిరెడ్డి, కన్నా ప్రసాదు, పాలచంద్రరావు, కోమట్ల వెంకటరామిరెడ్డి, పెల్లేటి చిన్న, గుమ్మడి శ్రీను, బిజెపి శివకుమారి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్వాక్రా విఓఏలకు ఉచిత మొబైల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో డ్వాక్రా గ్రూప్స్‌కు చెందిన విఓఏలకు ఉచితంగా చరవాణిల పంపిణీ కార్యక్రమాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు స్వయంగా అందజేశారు కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని విఓఏలకు మొబైల్ ఫోన్లు అందజేశారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా గ్రూపులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వారి పనితీరును సాంకేతికంగా మరింత మెరుగుపర్చేందుకు చరవాణులు అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోన్ల ద్వారా విఓఏలు గ్రూపుల వివరాలు, లావాదేవీలు, సమావేశాలు వంటి కార్యకలాపాలను సులభంగా నిర్వహించగలరని దామచర్ల తెలిపారు. ప్రభుత్వ పథకాల సమాచారం వేగంగా చేరేందుకు, సమన్వయం మెరుగుపడేందుకు ఈ చర్య దోహదపడుతుందని వివరించారు. మహిళల సాధికారతకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, ఈ పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళలు మరింత శక్తివంతంగా మారతారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న విఓఏలు ఈ సహాయంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ కార్యకలాపాలను మరింత చురుకుగా కొనసాగిస్తామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మహిళా సంఘాలకు మరిన్ని సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, డ్వాక్రా సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లాంగ్ జంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన కల్లు రాజేశ్వరి

**ఒంగోలు, ప్రభాతవార్త**




థాయిలాండ్‌లో జరుగుతున్న వరల్డ్‌మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో 2026లో ఒంగోలుకు చెదదిన పశుసంవర్ధకశాఖ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కల్లు రాజేశ్వరి 2కెయం వాక్లిట గోల్డ్‌మెడల్ మరియు లాంగ్ జంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. స్థానిక విజయవాడ హెచ్ ఆఫీస్‌నందు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పనిచేయుచున్న రాజేశ్వరిని డైరెక్టర్ దామోదర్ నాయుడు, అడిషనల్ డైరెక్టర్ రజనీకుమారి అభినందించారు. దీని వలన జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచారని పశుసంవర్ధనశాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు రాజేశ్వరిని మరెన్నో పతకాలు సాధించాలని దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరుకున్నారు.

## పీఎం గ్రామ సడక్‌యోజన పథకం కొనసాగింపు - మాగుంట

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకాన్ని 2025 మార్చి తరువాత నుండి 2028 మార్చి వరకు కొనసాగించుటకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. గ్రామీణ మార్గాల గుండా ప్రధాన రహదారులకు అనుసంధానించడబడే రోడ్డు మార్గాల పథకం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన 2028 మార్చి వరకు సవరించిన రూ.83,977 కోట్ల అంచనాతో కేంద్రం పొడిగించిందని, గ్రామీణ నివాసాలు, వ్యవసాయ మార్కెట్లు, ఉన్నత పాఠశాలలు, వైద్యశాలలను కలుపుకొని రోడ్ల ఏర్పాటు చేయబడుటచే గ్రామీణ ప్రాంతాలు భాగా అభివృద్ధి చెందగలవని తెలిపారు. మైదాన, పర్వత ప్రాంతాలలో రోడ్లు, బ్రిడ్జిలు 2028 మార్చి లోపల మిగిలిపోయాయి, ఈ పథకాన్ని కొనసాగించినందుకు నరేంద్ర మోడీకి మాగుంట శ్రీనివాసులురెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

## కొత్తపట్నంలో కలకలం.. సముద్రంలో మహిళ మృతి

**కొత్తపట్నం ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలో ఆదివారం ఉదయం కలకలం రేగింది. గుండంమాల గ్రామానికి చెందిన పెద్ద సింగూ ముసలమ్మ అలియాస్ ఎల్లమ్మ (49), వెంకటేశ్వర్ల భార్య, అనుమానాస్పద పరిస్థితుల్లో సముద్రంలో మృతి చెందడం సంచలనంగా మారింది. కుటుంబ సమస్యలు మరియు గ్రామస్తులతో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఆమె సముద్రంలోకి వెళ్లినట్లు సమాచారం. పిన్నివారి పాలెం గ్రామం సముద్ర తీరానికి మృతదేహం కొట్టుకుని రావడంతో స్థానిక మత్స్యకారులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ కు తరలించినట్లు తెలిపారు, ఈ సంఘటన పైన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతురాలి మరణానికి గల అసలు కారణాలు ఏంటన్నది పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

# కర్షకులకు ప్రభుత్వ ఇనాం

- భూముల రిజిస్ట్రేషన్‌కు పచ్చజెండా
- రైతులు హర్షం
- 50వేల ఎకరాలకు విముక్తి

**ఒంగోలు, ప్రభాతవార్త**

గ్రామ సేవా(విలేజ్ సర్వీస్) ఇనాం భూములు కలిగిన రైతులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఆ భూములను నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పిస్తామన్న సీఎం హామీని రెవెన్యూ శాఖ అమల్లోకి తీసుకొచ్చింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 50వేల ఎకరాల గ్రామ సేవా ఇనాం భూములను ఫ్రీహోల్డ్ పరిధిలోకి తీసుకొస్తున్నామని వాటి నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించాలంటూ రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు కలెక్టర్లకు, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ప్రత్యేక మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ భూములను పట్టా భూములుగా గుర్తిస్తూ రెవెన్యూ రికార్డులను మార్చనున్నారు. ఫ్రీహోల్డ్‌గా ప్రకటించడంతో ఇకపై వాటి క్రయవిక్రయాలకు అవకాశం కలగనుంది. ఒంగోలు మండలం గుడిమెళ్ళపాడు గ్రామంలో వివిధ సర్వే నెంబర్లతో వంద ఎకరాలకు పైగా భూములు గత వైకాపా ప్రభుత్వ హయాంలో జ రిగిన భూముల రీసర్వే అనంతరం ఇనాం భూములుగా నమోద య్యాయి. 1964కు ముందే వారి పూర్వీకులకు రైత్వారి పట్టాలు ఇచ్చారు. వారసత్వంగా వస్తున్నా భూములు తాజా గా ఇనాంగా నమోదు చేయడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు నగర పరిధిలోని గ్రామం కావడంతో మార్కెట్లో మంచి ధరలు ఉన్నా ఇనాం భూమిగా నమోదు కావడంతో క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సార్వత్రిక ఎన్నికల ముందు అసైన్డ్ నిబంధన సవరించారు. 2023కు ముందు అసైన్డ్ చేసిన భూములపై అనుభవ దారులకు హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న పేదలకు ఉపశమనం కలిగించినా వాటి వెనుక వైకాపా నాయకులు చక్రం తిప్పారు. అర్హత లేకున్నా ఫ్రీహోల్డ్ కింద ఇతరత్ర భూములకు సైతం క్రయవిక్రయాల నిమిత్తం రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించారు. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెవెన్యూ అధికారులు సిఫార్సులతో అక్రమ రిజిస్ట్రేషన్లుజరిగాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూముల్లో అక్రమాలపై నిగ్గుతేల్చేందుకు ఇనాం భూములుగా



నమోదైన వాటికి కూడా రిజిస్ట్రేషన్ నిలిపివేసింది. అదే సమయంలో అసైన్డ్, ఇనాం భూములు కలిపి నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో ఇనాంగా నమోదైన రైత్వారి పట్టా భూమిలో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడింది. ఇనాం జాబితాలో ఉన్న వ్యవసాయ భూములను కుటుంబ అవసరాల నిమిత్తం అమ్ముకోలేక కొందరు ఆస్తులు భాగ పంపిణీ చేసుకోలేక మరికొందరు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడేళ్లుగా తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టర్ల చుట్టు తిరిగినా రాష్ట్ర స్థాయి సమస్య అంటూ అధికారులు సమాధానం ఇవ్వడంతో బాధిత రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కులవృత్తిదారులు ఆలయ పూజారులు, తదితరులకు ఇనాం(దానం) రూపంలో సాగు భూములు ఇచ్చారు. బ్రిటీష్ కాలంలో నిర్వహించిన ఆర్ఎస్ఆర్‌లను సంబంధిత వ్యక్తులు చేసే వృత్తి ఆధారంగా(సర్వీసు ఇనాంగా) నమోదు చేశారు. స్వాతంత్రం అనంతరం 1956లో నాటి ప్రభుత్వం ఇనాం నిర్మూలన చట్టం తీసుకువచ్చింది. అప్పటికే పంటలు సాగు చేస్తున్న వారిలోని అర్హులను గుర్తించి రైత్వారి పట్టాలను మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో భూ దస్త్రాల స్వచ్ఛీకరణ చేపట్టారు. దీంతో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా మార్చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల ఎకరాలకు పైగా ఇనాం భూములుగా మారిపోయాయి. రైతులు పంట రుణాలకు అడంగల్ తీసుకున్నా ఇనాం భూములుగా చూపడంతో చిక్కును తెచ్చింది. రైత్వారి పట్టా భూములకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం సడలింపు ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫ్రీహోల్డ్ జాబితాలో ఉన్న సర్వీసు ఇనాం పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అనేక విన్నపాలు అందాయి. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితా నుంచి విలేజ్ సర్వీసు ఇనాం భూములకు ప్రభుత్వం నుంచి విముక్తి కల్పించింది. ఈ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లపై ఉన్న నిషేధం ఎత్తివేయడంతో పాటు వాటి రిజిస్ట్రేషన్ సజావుగా జరిగేలా సాఫ్ట్వేర్‌లో మార్పులు చేయనున్నారు.

## రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా ప్రకాశాన్ని మార్చేందుకు సమన్వయంతో పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా ప్రకాశాన్ని మార్చేందుకు మరింత సమన్వయంతో సంబంధిత శాఖలు పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు, పురోగతిపై ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి ఆయన సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్యల నివేదికను డీటీసీ ఆర్.సుశీల ఈ సందర్భంగా వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ లోపాలు, ఎన్‌ఫోర్స్ మెంట్‌లో నిర్లక్ష్యం కారణంగా ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు ప్రమాదాలు జరగకూడదని స్పష్టం చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపేలా చూడాలని, వెండింగ్ జోన్స్ లోనే దుకాణాలు ఉండేలా సమర్ధంగా పర్యవేక్షించాలని చెప్పారు. సంబంధిత అంశాలలో వివిధ శాఖల మధ్య మరింత సమన్వయం కోసం జేఏసీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాట్సప్ గ్రూపు ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకునే సదుపాయం కల్పిస్తామన్నారు. నిర్దిష్టంగా ఆదేశాలు వచ్చే వరకు ఆగకుండా ఈ గ్రూపులో పంచుకునే సమాచారం ఆధారంగా సంబంధిత శాఖలు సత్వరమే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాద కేంద్రాలుగా రహదారుల వెంట ఉన్న ప్రాంతాలలో శాశ్వత ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇందుకోసం దీర్ఘకాలం వేచి చూడకుండా తాత్కాలిక ప్రాతిపదికన తక్షణ చర్యలు తీసుకోవడంపైనా దృష్టి సారించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ ను రహదారి భద్రతకు వినియోగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఇల్యూమినేషన్స్, సీసీటీవీలు పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌ఫోర్స్ మెంట్ పైనా మరింత దృష్టి సారించడం వలన జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు 21శాతం తగ్గాయన్నారు. ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశీ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మసీదులకు తుది గడువు

**- పత్రాలు లేకుంటే వేతనాలు కట్**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మసీదుల పరిపాలనపై అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. అవసరమైన పత్రాల సమర్పణకు ఈ నెల 30వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. గడువులోగా పత్రాలు ఇవ్వని పక్షంలో ఇమామ్‌లు, మోజన్‌ల గౌరవ వేతనాలు నిలిపివేయబడతాయి. ఈ విషయాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పి. పార్థసారథి స్పష్టం చేశారు. ప్రతి మసీదు కమిటీ ప్రెసిడెంట్ లేదా ముతవల్లి బాధ్యతగా పత్రాలు సమర్పించాలి. మసీదు రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా జతచేయాలి. స్థలానికి సంబంధించిన చట్టబద్ధ పత్రాలు కూడా ఇవ్వాలి. అసంపూర్ణ పత్రాలను అధికారులు తిరస్కరిస్తారు. పత్రాలు ఒంగోలు జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయంలోనే సమర్పించాలి. గడువు పాటించకపోతే ప్రభుత్వ ప్రయోజనాలు కోల్పోతారు. విలంబం ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతించబడదు. ప్రభుత్వ పథకాలు సరైన లబ్ధిదారులకు చేరాలనే ఉద్దేశమన్నారు. నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తే బాధ్యత వారిపైనే ఉంటుందని హెచ్చరించారు. గడువు తర్వాత ఎలాంటి అవకాశాలు ఇవ్వబడవు. మరిన్ని వివరాలకు జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయాన్ని సంప్రదించాలి. అదనపు సమాచారం కోసం 7331175265, 7331157343 నంబర్లను సంప్రదించవచ్చు.

## ఒంగోలులో డిజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల





**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఒంగోలు నగరంలో తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు చెందిన డి జే ఆర్ ట్రస్ట్ నిర్వహణలో చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఆయన భార్య నాగ సత్యలత వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించారు. ప్రారంభంలో మానవ సేవే మాధవ సేవ అనే భావనను ప్రతిబింబించే సందేశంతో కార్యక్రమం ప్రారంభమైంది. మనిషి చేసే సేవే శాశ్వతమని, సంపదలు తాత్కాలికమని, ప్రకృతి కూడా నిరంతరం సేవ చేస్తుందనే సందేశాన్ని నిర్వాహకులు వివరించారు. నగరంలోని రిమ్స్ ఆసుపత్రి, బైపాస్ ఫ్లైఓవర్, కోర్టు సెంటర్, పార్టీ కార్యాలయం వంటి ప్రధాన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు మరియు మజ్జిగ అందిస్తున్నారు. ప్రయాణికులు, రోజువారీ కూలీలు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడుతున్నాయి. మజ్జిగలో జీలకర్ర, అల్లం, కరివేపాకు కలిపి అందించడం ద్వారా దాహం తగ్గడంతో పాటు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం 25 కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ వినియోగం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈసారి ప్రధాన కేంద్రాలపై దృష్టి సారించి సమర్థవంతంగా సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రారంభంగా ఐదు కేంద్రాలతో మొదలుపెట్టి మొత్తం తొమ్మిది ప్రాంతాలకు విస్తరించాలనే ప్రణాళిక రూపొందించారు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుతున్న నేపథ్యంలో ప్రజలు సన్‌స్ట్రోక్‌కు గురికాకుండా చూడడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ చలివేంద్రాలు సుమారు 40 రోజుల పాటు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి చర్యలు అవసరమని పేర్కొన్నారు. అదనంగా విద్యార్థుల అభ్యర్థన మేరకు మే నెలలో విద్యా పరీక్ష నిర్వహించేందుకు ట్రస్ట్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాతూర్తు ఎన్నికల ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్యే ఏలూరి

**- తమిళనాడులో ప్రచారానికి సీఎం చంద్రబాబు**

**మార్టూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**



తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ తరుపున సాత్తూరు ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావును నియమిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సాత్తూరు పరిధిలో ఎన్నికల నిర్వహణ పార్టీసమన్వయం ప్రచార వ్యూహాలు అమలు వంటి బాధ్యతలను ఏలూరి నిర్వర్తించనున్నారు. స్థానిక నాయకత్వం తో సమన్వయం చేస్తూ ఎన్డీఏ అభ్యర్థి విజయానికి కృషి చేయనున్నారు. క్రమంలో సాత్తూరు నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జిలుగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు వెళ్ళనున్నారు.

## వాసవి మాత జయంతి శోభాయాత్రలో భారీగా పాల్గొన్న ఆర్యవైశ్యులు



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఒంగోలు నగరంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ఆర్యవైశ్యులు భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ తదియారాధన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వందలాది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సుమారు 400 ద్విచక్ర వాహనాలతో యువకులు, మహిళలు, యువతులు జై వాసవి నినాదాలతో నగర వీధుల్లో ఊరేగారు. దేవస్థానం వద్ద డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, స్టెప్ సీఈఓ పి శ్రీమన్నారాయణ, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సేవా సంస్థ ప్రతినిధి శిద్దా జయశ్రీ జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. పాల్గొన్న వారు ఎరుపు, పసుపు, కాషాయ రంగు తలపాగాలు



ధరించి, వాసవి పతాకాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గాంధీ రోడ్, దక్షిణం బజార్, ఏనుగు చెట్టువీధి, పప్పు బజార్, పత్తివారి వీధి, పాత కూరగాయల మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్, రామ్ నగర్ మొదటి వీధి, ట్రంక్ రోడ్డు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, కేశవ స్వామి పేట, రాజాపనగల్ రోడ్ మార్గంగా శోభాయాత్ర సాగి తిరిగి దేవస్థానం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా డీఎస్పీమాట్లాడుతూ వాసవి మాత ప్రపంచానికి త్యాగం, ప్రేమ, సేవ, సహనం వంటి విలువలను అందించిందని, ప్రతి ఒక్కరూ ఆ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఆర్యవైశ్యులు సంఘటితంగా సంప్రదాయాలను కొనసాగిస్తూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. 110 సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయంలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ తదియారాధన సంఘసభ్యులు సమర్ధంగా నిర్వహించారు.

# ఘనంగా వైశాఖ పూజలు ప్రారంభం

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు







బల్లికురవ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ఆధ్యాత్మిక సాధనకి అద్భుతమైన మాసాలలో ఒకటి వైశాఖము, ప్రాముఖ్యతను చాటుతుంది. ఆదివారం నుండి వైశాఖ మాసం ప్రారంభం కావడంతో దేవాలయాలలో ప్రత్యేక పూజలు ఆరంభించారు. వైశాఖము, మాఘము, కార్తికము ఈ మూడింటిని ఆధ్యాత్మిక సాధనలో చాలా ప్రధానంగా చెప్తారు. ఏ విధంగా అయితే కార్తీక పురాణం, మాఘ పురాణం ఉన్నాయో అదే విధంగా వైశాఖ పురాణాన్ని కూడా వ్యాసదేవుడు రచించాడు. ఆధ్యాత్మికంగా భగవదనుగ్రహం పొందడానికి ఈ మాసం అన్ని విధాలా అనుకూలమైనది. సాధనా మాసంగా దీనిని నిర్వచించవచ్చు. వసంత ఋతువులో రెడవ మాసం ఇది. దీనికి వైదిక నామం మాధవ నామము. మధు అని చైత్రమాసానికి, మాధవ అని వైశాఖ, మాసాన్ని పేర్కొంటారు. వైశాఖమాసం లక్ష్మీ నారాయణుల ఆరాధనకి చాలా ప్రసిద్ధమైంది. వైశాఖంలో నారాయణుడి అనుగ్రహం కోసం ప్రత్యేక వ్రతాలను ఆచరిస్తుంటారు. వైశాఖంలో పాడ్యమి నుంచి అమావాస్య వరకు ఒక్క రోజు కూడా క్రమం తప్పకుండా అనునిత్యం నారాయణుని తులసితో ఆరాధించడం వల్ల విశేష ఫలితాలు వనగూరుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయి. నారాయణుడుకి సమర్పించే తులసి కూడా కృష్ణ తులసి సమర్పిస్తే శ్రేష్టం అని ధర్మశాస్త్రం చెప్తుంది. విష్ణు సహస్రనామ పారాయణ వైశాఖం అంతా చాలా ప్రశస్తమైనటువంటిది. అనునిత్యం కూడా అశ్వత్థ వృక్షానికి సమృద్ధిగా జలం పోసి ప్రదక్షిణలు చేయడం, వైశాఖం అంతా చేసినట్లయితే అభీష్ట సిద్ధి లభించడమే కాక పితృదేవతలు తృప్తి చెందుతారు అని వేదాలు తెలియజేస్తున్నాయి. గళంతిక ఆరాధన- శివునకు ఈ మాసమంతా అభిషేకం చేస్తే చాలా ప్రసిద్ధి. అనునిత్యం శివారాధన అభిషేకంతో చేయాలి. అది ఆధ్యాత్మిక ఆది భౌతిక ఆదిదైవిక తాపత్రయాలను తొలగించి మనశ్శాంతినిస్తుంది. అందుకు శాంతి కోసం శివునికి అభిషేకం చేస్తారు. శివాలయాలలో శివునకు పైన గళంతికను ఏర్పాటు చేయడం కూడా చాలా మంచిది. దీనినే దారాపాత్ర అంటారు. నిరంతరం శివుడి మీద ధారపడేటట్లుగా ఒక పాత్రను ఏర్పాటు చేయాలి. ఇలా మాసం అంతా శివునిపై ధారపడేటట్లు చేసినట్లయితే సృష్టిలో ఉన్నటువంటి వేదనలు, తాపాలు, అరిష్టాలు నశిస్తాయని ధర్మశాస్త్రములు చెప్తున్న విషయం. వైశాఖంలో ఉదకుంభ దానము. అంటే నీటితో నింపిన పాత్రను దానం చేయడం. బాటసారులకు చలివేంద్రములు ఏర్పాటు చేసి జలాన్ని ఇవ్వడం వైశాఖంలో ప్రసిద్ధి. ఈ సందర్భంగా రామాలయాలలోనూ, శివాలయాలలోనూ, అమ్మవారి దేవాలయాలలోనూ ప్రత్యేక అలంకరణలు అభిషేకాలు కొనసాగాయి.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణం, గ్రామోత్సవం



నాగులుప్పలపాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మండలంలోని ఉప్పుగుండూరు, నీలాయపాలెం పొలిమేరలో వేంచేసి యున్న భూనిలయ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి కళ్యాణం ఆదివారం వేద పండితులైన శిష్టా పాండు రంగయ్య, కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వేదమంత్రాలతో కళ్యాణం నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అత్యధికంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి విద్యుత్ కాంతులతో నీలాయపాలెం, ఉప్పుగుండూరు గ్రామాల్లో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

## పెద్దారికట్లలో ప్రారంభమైన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు





కొనకనమిట్ల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మండలంలోని పెద్దారికట్లలో కొలువైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకుర్పానతో ప్రారంభమయ్యాయి. 12రోజులు పాటుఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రోజుకో ఉత్సవంతో చెన్నకేశవస్వామి, రాజ నాగేశ్వర స్వామిల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆలయం ముఖద్వారం సమీపంలో ఏర్పాటు చేసిన రాతి ధ్వజస్తంభం ఇప్పటికే చెక్కుచెదరలేదు. 20న ధ్వజారోహణ, 21న రుద్రమండపం, 22న హనుమంత సేవ, 23న లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణం, 24న గరుడ సేవ, 25న ఎల్లటేనుగు, 26న శివపార్వతుల కళ్యాణం, 27న నంది సేవ, 28న రథోత్సవం, 29న వసంతోత్సవం, 30న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజు నిర్వహించే స్వామివారి ఉత్సవాల్లో ఉభయ దాతలు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహిస్తారు. వేద పండితులు నంద్యాల వెంకటకృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకట కృష్ణారావులు పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

## ఉమ్మడి ప్రకాశం జిల్లా మీ సేవ అసోసియేషన్ అధ్యక్షులుగా వెంగళరెడ్డి





పొదిలి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ఉమ్మడి ప్రకాశం జిల్లా మీ సేవ అసోసియేషన్ అధ్యక్షులుగా సానికొమ్ము వెంగళరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పొదిలి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేయడంజరిగింది. ఉపాధ్యక్షులుగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి, కార్యదర్శిగా మారాబత్తిని వెంకటసురేష్, శేఖర్‌లు, కోశాధికారిగా రామాంజనేయులు, స్టేట్ కమిటీ సభ్యులుగా అవ్వారి వెంకట రాయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాము మాట్లాడుతూ మీ సేవ నిర్వాహకుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ వలన మీ సేవ నిర్వాహకులు ఎన్నో కష్టాలు అనుభవించాము అని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మీ సేవ నిర్వాహకుల సమస్యలు తీర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూతన జనరల్ సెక్రటరీ సురేష్, ట్రెజరర్ రమణారావు, యాసిన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మీ సేవ మిత్రులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతులచ్చన్నకు నివాళులర్పించిన ఎమ్మెల్యే తాటిపర్తి



యర్రగొండపాలెం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

స్వాతంత్ర్య సమరయోధుడు, సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి యర్రగొండపాలెం పట్టణంలో ఆదివారం వైసీపీకి చెందిన గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. యర్రగొండపాలెం మండలం వైసీపీ గౌడ సంఘం నాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ ఆంజనేయస్వామి గుడి ఎదురుగా డివైడర్‌పై ఉన్న ఆయన గౌతులచ్చన్న విగ్రహానికి స్థానిక శాసనసభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌతులచ్చన్న రైతుల కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తి విగ్రహం మండల కేంద్రంలో ఉండటం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులతో పాటు మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత డాక్టర్ సింగయ్యకు పలువురు ఘన నివాళులు



సంతనూతలపాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మండల కేంద్రమైన సంతనూతలపాడులో టీడీపీ నేత డాక్టర్ మన్నం సింగయ్య 36వ వర్ధంతి వేడుకల్లో భాగంగా ఆదివారం నాడు సంతనూతలపాడులో బస్టాండ్ సెంటర్ వద్ద గల డాక్టర్ సింగయ్య, ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ సర్పంచ్, నీటి సంఘం అధ్యక్షులు మన్నం రంగ నాయకమ్మ, డాక్టర్ సింగయ్య కుమారుడు మన్నం చిన్న, టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, టీడీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సింగయ్య అని మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తన ప్రసంగంలో కొనియాడారు. సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్, స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ చిత్రపటాలకు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వివరం గోవిందు, మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీరామమూర్తి, నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ టి.నరసింహారావు, ఒంగోలు డైరీ మాజీ డైరెక్టర్ చెరుకూరి బోసు, సంతనూతలపాడు టీడీపీ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, కొప్పులు శ్రీనివాసరావు, సీహెచ్ వెంకట సుబ్బయ్య, మార్పుడి అంజయ్య, ఎం.జనార్ధన్, కోతికోటేశ్వరరావు, మద్దిరాల శ్రీనివాసరావు, ఆళ్ల రంగయ్య, మొలకలపల్లి శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, బొడ్డపాటి రమణారావు, బొడ్డపాటి చంద్రశేఖర్, ఎస్.కొండలరావు, పి.భాస్కరరావు, వి.కోటేశ్వరరావు, నాదెండ్ల ఆంజనేయులు, మండల టీఎన్‌టీయుసీ కార్యనిర్వహక కార్యదర్శి రామకూరి జార్జి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు





సంతనూతలపాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

సంతనూతలపాడులో శనివారం రాత్రి ఘనంగా శ్రీ గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు జరిగాయి. ఒంగోలు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి ప్రతినిధి సన్నమూరి సుబ్బరాచారి పర్యవేక్షణలో ఈ కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఇంకొల్లు మధుసూదనచార్యులు, ఏల్చూరి ప్రదీప్ శాస్త్రి, నల్లపాటికుమార్‌స్వామి, ప్రత్తిపాటి విశ్వబ్రహ్మం, ఆదిమూలం శ్రీసాయి శర్మ ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికళ్యాణ మహోత్సవం వేడుకలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సంతనూతలపాడులో ఈ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరిగాయి. అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఒంగోలు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మ ప్రచార పరిషత్ అధ్యక్షులు ఆలత్తురి వీబ్రహ్మం, ఉపాధ్యక్షులు ఎండేటి కృష్ణ సాగర్, కమిటీ సభ్యులు, ఆలయాల అభివృద్ధి ప్రతినిధి సన్నమూరి సుబ్బనాచారి తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవ వేడుకల్లో అప్పికట్ల విశ్వం, లక్ష్మీ కుమారి, సన్నమూరి అరుణ్ కుమార్, ప్రేమలత, పోకూరి పనీంద్ర, ఉషారాణి దంపతులు, కొత్తపల్లి సురేష్ కుమార్, శ్రీవిద్య దంపతులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, త్రిపురాంతక స్వామి దేవస్థానం చైర్మన్ శిఖాకొల్లి ఉమామహేశ్వరరావు, ఆలయాల డైరక్టర్లు మనపాటి బ్రహ్మయ్య, మద్దిరాల శ్రీనివాసరావు, గద్దం శ్రీలక్ష్మీ, ఏడుకొండలు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం
## చీమకుర్తి తాలూకా యూనిట్ అధ్యక్షులుగా పాపారావు ఎన్నిక



సంతనూతలపాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ప్రభుత్వం నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం చీమకుర్తి తాలూకా యూనిట్ అధ్యక్షులుగా మద్దిపాడు వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఎన్నాబత్తిన పాపారావు, కమిటీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.బాలఅంకయ్య (సాంఘిక సంక్షేమశాఖ), ఎం.జయరాం(వెటర్నరీ డిపార్టుమెంట్) కార్యదర్శిగా టి.రమేష్, సంయుక్త కార్యదర్శిలుగా ఎస్.రాఘవేంద్రరావు, ఎస్‌డీ అమర్, కోశాధికారిగా బడుగు అంకమ్మలు ఈ మేరకు ఎన్నికైనట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోమటిగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని జిల్లా సంఘ భవన్‌లో జరిగిన సమావేశంలో చీమకుర్తి తాలూకా యూనిట్ 4వ తరగతి ఉద్యోగుల సంఘానికి ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### 24 నుండి శ్రీకారం రోటరీ కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల స్థాయి 16వ నాటికల పోటీలు




మార్టూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి 26వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో 16వ నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకారం రోటరీ కళాపరిషత్ కన్వీనర్ జాష్టి వెంకట మోహన్‌రావు, శ్రీకారం అధ్యక్షులు కందిమళ్ళ సాంబశివరావు తెలిపారు. ఈ నాటిక పోటీలు మార్టూరులోని జాతీయ రహదారి పక్కన రోటరీ కళా ప్రాంగణ ఆవరణంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఎఫర్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జేవీ మోహన్‌రావు మాట్లాడుతూ కళను ఆయుధంగా చేసుకొని సామాజిక ఇతి వృత్తాలలో ప్రజలకు అవగాహన కలిగించి, సానుకూల దృక్పథంతో సమాజంలో సామాజిక బాధ్యత పెంపొందించాలనే సంకల్పంతో గత 15 సంవత్సరాలుగా ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చి రాష్ట్ర స్థాయిలో నాటిక పోటీలను శ్రీకారం రోటరీ కళా పరిషత్ నిర్వహిస్తుందన్నారు. ఈ నాటికల పోటీలలో యావత్ ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంతర్జాతీయ రోటరీ చరిత్రలో కళా పరిషత్ నిర్వహిస్తున్న ఏకైక క్లబ్ మార్టూరు మాత్రమేనని కందిమళ్ళ సాంబశివరావు అన్నారు.

**పోటీలలో ప్రదర్శించు నాటికలు :**

24వ తేదీ తొలి ప్రదర్శనగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి దువ్వుణ్ణి చూశా, రెండో ప్రదర్శనగా కళానికేతన్ వీరన్నపాలెం వారి దీపంకింద చీకటి, మూడో ప్రదర్శనగా విజయవాడ సాంస్కృతిక సమితి వారి మమ్మల్ని బతకనివ్వండి అనే నాటికలు ప్రదర్శించనున్నారు. రెండో రోజు తొలి ప్రదర్శనగా వైజాగ్ వారి అగ్నిసాక్షి, రెండో ప్రదర్శనగా శ్రీకృష్ణ ఆర్ట్స్ గుడివాడ వారి ద్వారబంధాల చంద్రయ్య నాయుడు, మూడో ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి చెరిగిపోని చిరునామా అనే నాటికలు ప్రదర్శించనున్నారు. ఆఖరి రోజు తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి సహన, రెండో ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, తుది ప్రదర్శనగా జీవీకే క్రియేషన్స్ కాకినాడ వారి కన్నీటికి విలువెంత..? అనే నాటికలను ప్రదర్శించనున్నారు. ఈ నాటికల పోటీలను జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ప్రారంభిస్తుండగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఐపీఎస్ మహేశ్వరరాజు, విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు, ఐఏఎస్ ఎం.కృష్ణ తేజ హాజరు కానున్నారు. ఈ కళాపరిషత్ లో పాల్గొనే ప్రతి కళాకారునికి వ్యక్తిగత బహుమతులు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకారం కార్యదర్శి జాష్టి అనురాధ, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, రావి అంకమ్మ చౌదరి, ఎం.ఈశ్వర ప్రసాద్, జాష్టి సాంబశివరావు, బసవరాములు, షేక్ ఖాజా హుస్సేన్, ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



తాళ్లూరు, ఏప్రిల్19, ప్రభాతవార్త

మండలం లోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయలక్ష్మి అమ్మవారి మూల విరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, గోత్రనామాలుపూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్ల సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులకు ఆలయ అన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ సానెసురేష్, ఈవో నర్రానారాయణరెడ్డి, ఆర్‌ఏ కాటూరి ప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే తూర్పు గంగవరం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నెల పొంగళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

### గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన శ్రీధర్, మాధవి



తాళ్లూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

గుంటి గంగా భవాని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన గూడా శ్రీధర్ రెడ్డి(ఎన్ ఆర్ఐ), ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు రోళ్ళ మాధవి. అనంతరం తీర్థ ప్రసాదరావు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శులు భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, నాని, మధు తదితరులు పాల్గొన్నారు.

## చోరి గురైన ట్రాన్స్ ఫార్మర్‌లు త్వరలో ఏర్పాటు



తాళ్లూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ఇటీవలే పలు గ్రామాలలో చోరీకి గురైన ట్రాన్స్ ఫార్మర్‌ల స్థానం కొత్తవి త్వరలో ఏర్పాటు చేస్తామని దర్శి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. రవి కుమార్ అన్నారు. ఇటీవలే పలు గ్రామాలలో రాత్రి సమయాలలో పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లు చోరిలు జరుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పోలీస్, విద్యుత్ సిబ్బంది సంయుక్తంగా గ్రామాల పొలాలలో రాత్రివేళ గస్తీలు నిర్వహిస్తున్నామన్నారు. రైతుల కూడా అప్రమత్తంగా ఉంటూ అనుమానితులు, కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసు, విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు ఎవరు కూడా పోలీస్ స్టేషన్, విద్యుత్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చోరి గురైన ట్రాన్స్ ఫార్మర్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

### మూలస్థానేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠకు మంత్రి స్వామికి ఆహ్వానం



సింగరాయకొండ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మండలంలోని సోమరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వర స్వామి వారి నూతన ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ఆదివారం టంగుటూరు తూర్పు నాయుడు పాలెంలోని మంత్రి నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 27 నుంచి మే 1 వరకు పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. మే 1న యంత్ర స్థాపన, ధ్వజస్తంభ స్థాపన, శాంతి కళ్యాణం, అన్నసంతర్పణ వంటి ముఖ్య కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ పవిత్ర కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జిబి కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు శీలం సుబ్రహ్మణ్యం, శీలం చంద్రశేఖర్, శీలం వెంకటరావు, నర్రా రాంబాబు, శీలం రమణయ్య, వేల్పుల వెంకటేశ్వర్లు, రామకోటయ్య, సాయి బ్రహ్మేంద్ర, గోపి, జగదీశ్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై కఠిన చర్యలు

సింగరాయకొండ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, ఇటువంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదనరావు హెచ్చరించారు. అక్షయ తృతీయ సందర్భంగా ప్రకాశం జిల్లా మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో సింగరాయకొండ పట్టణంలోని బుంగబావి సెంటర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన బాల్య వివాహాల వల్ల బాలికలపై పడే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. బాలల హక్కులు పరిరక్షణ లో ప్రతి ఒక్కరు పాత్ర కీలక మన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. నాగమణి ప్రభుత్వ పథకాలు, చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు బాల్య వివాహాల నిరోధక చట్టం-2006, పోక్సో చట్టం-2012 అమలుపై వివరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వై.అంజమ్మ బాలికల రక్షణ చర్యలను వివరించగా, మెడికల్ అధికారి లావణ్య ఆరోగ్య సమస్యలను వెల్లడించారు. పోలీసులు చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# తాళ్లూరులో మెగా వైద్యశిబిరం



తాళ్లూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని తాళ్లూరు టీడీపీయువనాయకుడు ఐడమాకంటి శ్రీనివాస రెడ్డి జ్ఞాపకార్థం కిమ్స్, మోడరన్ ఐ హాస్పటల్ సౌజన్యంతో తాళ్లూరు ఏబీసీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైనది. కార్యక్రమాన్ని దర్శి టీడీపీ నియోజక వర్గ సీనియర్ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ముఖ్య అతిధులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత మెగా వైద్యశిబిరం నేటికాలంలో ప్రజలకు మంచి ఉపయోగ కరమని అన్నారు. అధిక సంఖ్యలో వైద్య నిపుణులు ఒక చోటకు వచ్చి ప్రజలకు సేవ చేయటం అభినందనీయమని, అలా ఏర్పాటు చేసిన నిర్వాహకులు మాజీ సర్పంచి ఇడమాకంటి రమణా రెడ్డి, కార్యనిర్వాహకులు ఇడమకంటి వెంకట సుబ్బా రెడ్డి, టీడీపీ నాయకులను అభినందించారు. శిబిరంలో కిమ్స్ ప్రత్యేక వైద్యబృందం జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీహరిరెడ్డి, కిడ్నీ వైద్యనిపుణులు డాక్టర్ టివి రమణా రెడ్డి, ల్యాపరో స్కోపిక్ జనరల్ సర్జన్ డాక్టర్ పెరుమాళ్ల కార్తీక్ బాబు, మొదడు, నరాల వైద్యనిపుణులు ఎం. నిశ్చల్ రెడ్డి, స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సుంకర సుజని, ఎముకలు కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ ఐవీ రెడ్డి, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నారు రమణా రెడ్డి, వినయ్ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి, గౌతమి డెంటల్ వైద్యనిపుణులు డాక్టర్ తిరుమలరెడ్డి, మోడరన్ కంటి వైద్యనిపుణులు డాక్టర్ మారం వెంకట రమణా రెడ్డి, తదితరులు పాల్గొని 591 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఈసీజీ, రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఇడమకంటి రమణా రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, తూము శివ నాగిరెడ్డి, విజయ, కైపు రామ కోటిరెడ్డి, నాగార్జున రెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, గొల్లపూడి వేణుబాబు, వలి, పేరిరెడ్డి ఏబీసీ యాజమాన్యం కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, డైరెక్టర్ కాలేషా బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పొన్నలూరు - కె. అగ్రహారం మార్గంలో ప్రమాదకరంగా చిల్ల చెట్లు

పొన్నలూరు ,ఏప్రిల్ 19, ప్రభాతవార్త

పొన్నలూరు, కె.అగ్రహారం మధ్య ఉన్న ఓవి రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. రహదారికి ఇరువైపులా చిల్ల చెట్లు అధికంగా పెరిగి, వాటి కొమ్మలు రోడ్డుపైకి వంగి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా భారీ వాహనాలు వచ్చినపుడు ద్విచక్ర వాహన దారుల ముఖాలకు చెట్ల కొమ్మలు, ముళ్ళు తగిలి గాయాల పాలవుతున్నారు. ఇటువంటి సంఘటనలు రాత్రి వేళ ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా మూల మలుపుల వద్ద ఎదురు నుంచి వచ్చే వాహనాలు, పశువులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా, ఈ చెట్లను సరైన సమయానికి తొలగించకపోతే వాటి వేర్లు రహదారి అంచులను ఛిద్రం చేసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు మరింత ముదిరితే రోడ్డుకు మరింత నష్టం కలిగించే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. చెట్లు మరింత పెరిగిన తర్వాత వాటి వేర్లు రోడ్డు మధ్యకు విస్తరించి ఉంటే వాటిని తొలగించే సమయంలో కూడా రహదారి దెబ్బతినే ప్రమాదం ఉన్నదని అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, చెట్ల కొమ్మలను కత్తిరించడం, వేర్ల పెరుగుదలను నియంత్రించడం వంటి చర్యలు చేపట్టి రహదారిని సురక్షితంగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా రోడ్డు పని చేసిన కాంట్రాక్టరు రోడ్డు వేసినప్పటి నుండి 5 సంవత్సరాల వరకు పర్యవేక్షణ చేయాల్సి ఉందని వారి ద్వారా చెట్లు తొలగించే కార్యక్రమం చేపడతామన్నారు.





మార్కాపురం వార్త



# నేటి నుండి మద్దిరాలపాడులో

## వైభవంగా జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

- మొదటి బహుమతి రూ.3లక్షలు విలువ గల బుల్లెట్
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన టీడీపీ సీనియర్ నేత గుమ్మడి సాయిబాబు



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

నేటి నుంచి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడుపందాల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్‌నాయకులు గుమ్మడి సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన ప్రారంభం కానుంది. కి.శే మండవ వెంకటరావు జ్ఞాపకార్థం నిర్వహించబడుతున్న ఈ మెమోరియల్ పోటీలు ఏప్రిల్ 26వ తేదీ వరకు వారం రోజులపాటు నిరంతరాయంగా జరగనున్నట్లు ఆయన తెలిపారు. మద్దిరాలపాడులోని స్థానిక పెనుబోతు వీరయ్య చౌదరి ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుండి ఈ ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్‌ముప్పవరపు సుచిత్ర చౌదరి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, టుబాకో యూనియన్ చైర్మన్ జయంతిబాబు, ఒంగోలు మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావుతో పాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఈ ప్రాంత రైతులు, ప్రజలు హాజరు కానున్నట్లు సాయిబాబు తెలిపారు. ముఖ్యంగా ఏడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్న ఈ పోటీలను వివిధ విభాగాలుగా విభజిస్తూ నిర్వహించనున్నారు. పోటీలోగెలుపొందిన విజేతలకు నిర్వాహకులు భారీగా నగదు బహుమతులను ప్రకటించారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతిగా రూ.3లక్షలు విలువ గల రాయల్ ఎలిఫెన్ బుల్లెట్ ఇవ్వనున్నారు.ద్వితీయ బహుమతిగా రూ.1,20,000,తృతీయ బహుమతిగా రూ.1,00,000 అందజేయనున్నారు. మిగిలిన విభాగాల్లో కూడా మొదటి 10 స్థానాల్లో నిలిచిన వృషభ రాజముల యజమానులకు నగదు పురస్కారాలు ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి రోజు నిర్వహించే ఎడ్ల బల ప్రదర్శన పోటీలలో 9 కేటగిరిలలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకులు గుమ్మడి సాయిబాబు ఆధ్వర్యంలో వారి మిత్రబృందం పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి వచ్చే ఎడ్ల జతల యజమానులకు, రథ సారధులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనను వీక్షించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడాభారీగా రైతులు, పశుప్రేమికులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో ఒంగోలు మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, మద్దిపాడు మార్కెట్ యార్డ్‌వైస్ చైర్మన్ షేక్ ఖాజావలి,టీడీపీ యువ నాయకులు పోతినేని శ్రీనివాసరావు,మాజీ ఎంపీపీ పున్నారావు,తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.





మద్దిరాలపాడులో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనకు సిద్ధమైన ప్రాంగణం

# ఘనంగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**రాచర్ల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రాచర్లలోని గంగమ్మ తల్లి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ గంగమ్మ తల్లి పోతురాజు దేవస్థానం తృతీయ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం 6 గంటలకు అమ్మవారికి నీళ్ల పూజ, ఉదయం 10 గంటలకు బోనాల సమర్పణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు,అభిషేకాలు చేశారు. వార్షికోత్సవ సందర్భంగా భక్తులను గ్రామ ప్రజలను ఆహ్లాదపరిచేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కోలాటం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### చంద్రబాబు జన్మదినం సందర్భంగా

### నేడు మార్కాపురంలో మెగా జాబ్ మేళా

- 67 కంపెనీలు, 4 వేల ఉద్యోగాలు లక్ష్యం

**మార్కాపురం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం (ఏప్రిల్ 20) మార్కాపురం పట్టణంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో పట్టణంలోని సప్తగిరి సెంటర్‌లో ఉన్న బి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు క్యాప్‌జెమిని,టెక్ మహీంద్ర,లార్సెన్ అండ్ టర్బో,అరబిందో ఫార్మా, హెటెరో డ్రగ్స్, అపోలో ఫార్మసి, కియా మోటార్స్ తదితర సంస్థలు పాల్గొననున్నట్లు తెలిపారు. మొత్తం 67 కంపెనీలు హాజరై సుమారు 4 వేల ఉద్యోగాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంసీఏ, ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, బీఎస్సీ కంప్యూటర్స్,బీకాం కంప్యూటర్స్, ఎంకాం, బీఫార్మసీ, ఎంఫార్మసీతో పాటు ఏదైనా డిగ్రీ,ఐటీఐ, పదో తరగతి అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించనున్నారు. వివిధ రంగాలకు చెందిన ఉద్యోగ అవకాశాలు ఉండటంతో నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగాఅభ్యర్థులు తమ బయోడేటా/రెజ్యూమ్‌తో పాటు విద్యార్హతల మార్కుల జాబితాలను తీసుకురావాలని కోరారు. వెనుకబడిన ప్రాంతమైన మార్కాపురం అభివృద్ధి దిశగా ఈమెగా జాబ్ మేళా కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.నిరుద్యోగులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు

- తల్లిదండ్రులకు ఎస్పీ హెచ్చరిక



**మార్కాపురం, ఏప్రిల్ 19,ప్రభాతవార్త**

వేసవి సెలవుల నేపథ్యంలో మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు తెలిపారు. పిల్లల భద్రత దృష్ట్యా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వేసవి సెలవుల్లో 18సంవత్సరాలలోపు పిల్లలు సరదా కోసం ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ పేర్కొన్నారు.ట్రాఫిక్ నియమాలపై పూర్తి అవగాహన లేకుండా వాహనాలు నడపడం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, అలాంటి సందర్భాల్లో వాహన యజమానులు,తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారీ జరిమానాలు, అవసరమైతే జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై పర్యవేక్షణ అవసరమని,చిన్నప్పటి నుంచే హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా నియంత్రించాలన్నారు.అదే విధంగా వాహనదారులు రద్దీ సమయాల్లో సహనం పాటించాలని, రాంగ్ రూట్‌లో వెళ్లడం, అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేయడం మానుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు పోలీసులకు సహకరించాలని కోరారు.సుదూర ప్రయాణాలకు ముందు వాహనాల స్థితి టైర్లు, బ్రేకులు, ఇంజిన్ తప్పనిసరిగా తనిఖీ చేయాలని, జాతీయ రహదారులపై భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. హైవేలపై వాహనాలను నిలపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మైనర్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలను పూర్తిగా నివారించాలని ఎస్పీ సూచించారు.

# షిరిడి సాయిబాబా మందిరాల జిల్లా సమావేశం

- సేవా కార్యక్రమాలు, తప్పుడు ప్రచారాలపై కఠిన నిర్ణయాలు





**మార్కాపురం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని శిరిడి సాయిబాబా మందిరాల నిర్వాహక కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి సమావేశం ఆదివారం మార్కాపురం నెహ్రూ బజార్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి గోపాలుని హరిహరరావు అధ్యక్షత వహించారు. కందుకూరు, కొండెపి, సింగరాయకొండ, ఒంగోలు, అద్దంకి, దర్శి, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, మార్కాపురం తదితర ప్రాంతాల నుంచి సుమారు 50మంది మందిర నిర్వాహకులు పాల్గొని తమ తమ మందిరాల నిర్వహణ, అభివృద్ధిపై చర్చించారు. జిల్లా కమిటీ కోశాధికారి దేవకి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర శిరిడిసాయి భక్త మహాసమ్మేళనం నిర్వహణపై ప్రతిపాదనలు ఉంచి, రాష్ట్ర స్థాయి సమావేశానికి అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ సాయిబాబాపై జరుగుతున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తూ, అలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. సాయి మందిరాల ద్వారా సాయి తత్వం, సనాతన హిందూ ధర్మం ప్రచారం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు.ఈ సందర్భంగా బాబా మందిర కోశాధికారి పివిఎల్ఎన్‌వి నాగరాజు మందిరాల నిర్వహణపై వివరాలు వెల్లడించగా,మందిర అధ్యక్షుడు పేరం సత్యనారాయణ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశానికి హాజరైన వారందరికీ మందిర కమిటీ భోజన వసతులు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో యువజన సేవా సమాజ్ అధ్యక్షుడు కృష్ణమోహన్, మందిర కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, మందిర మేనేజర్ సతీష్ నాయుడు, భక్తులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# అక్రమ కేసులపై నిరసిస్తూ వైసీపీ భారీ ర్యాలీ

- స్టేషన్‌లో ఎమ్మెల్యే, ఎస్సై మధ్య వాగ్వాదం



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా ఏక వచనాలతో పోస్టులు పెడుతూ అదే విధంగా మండల స్థాయి నాయకులపై వైసీపీ సోషల్ మీడియాపై తెలుగుదేశం పార్టీ నాయకులు నమోదు చేస్తున్న అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలో ర్యాలీ జరిగింది. శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయం నుండి స్థానిక పోలీసు స్టేషన్ వరకు సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. స్టేషన్ వద్ద అక్రమ అరెస్టులను ఖండిస్తూ వైసీపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీగా తరలివచ్చిన శ్రేణులు స్టేషన్‌ను ముట్టడించి తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. స్టేషన్ ఆవరణలోకి రాగానే ఎస్సై, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎస్సై మాటలు దురుసుతనంగా ఉన్నాయంటూ వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపటి తరువాత ఎస్సై ఎమ్మెల్యేతో పాటు మరి కొందరిని ఆయన గదిలోకి ఆహ్వానించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన శాసనసభ్యులు స్థానిక ఎస్సై తీరు పట్ల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత నాయకులకు న్యాయం జరగాలని, అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ప్రజలహక్కులను రక్షించడం కోసం వైఎస్సార్‌సీపీఎల్లప్పుడూ ముందుంటుందని, ఇలాంటి అన్యాయాలకు తలొగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు.అధికారులు ఇంతలేకితనంగా అధికార పార్టీకి కొమ్ముకాయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి పట్ల గౌరవం మర్యాదలు పాటించకుండా ఓడిన వ్యక్తికి పల్లకి మోయడం బీహుజుర్ అనడం విడ్డూరంగా ఉందని ఇలాంటి సంప్రదాయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అధికారుల తీరుపట్ల విరుచుకు పడ్డారు. ఎర్రడైరీ రాసేది లోకేష్ కాదు ఇక కొద్ది రోజులలో నియోజకవర్గ స్థాయిలో మేము డైరీలు రాయబోతున్నామంటూ హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డితో పాటు ఆంజనేయరెడ్డి, మాజీ ఎంపీపీ, ఒంగోలు మూర్తిరెడ్డి, మాజీ సర్పంచ్ నియోజకవర్గంలోని పార్టీ ప్రధాన శ్రేణులతో పాటు ఐదు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

### రాహుల్ గాంధీ చిత్రపటాలను అవమానపరిచిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

లోక్‌సభలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోవడంతో, బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని గడియారం స్తంభం వద్ద రాహుల్ గాంధీ చిత్రపటాలను కాల్చి, కాళ్లతో తొక్కి అవమానపరినా వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కాపురం పట్టణ పోలీసు అధికారులకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, క్యాబినెట్ హోదా కలిగిన రాహుల్ గాంధీ చిత్రపటాలను కాల్చడం కోట్లాది కాంగ్రెస్ పార్టీ అభిమానులకు మరియు రాహుల్ గాంధీ అభిమానుల మనోభావాలను దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ హయాంలో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా మహిళలకు స్థానిక సంస్థల్లో 33 రిజర్వేషన్లు కల్పించిందని, అనేక ఉన్నత పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ హయాంలో యూపీ, బీహార్, మణిపూర్ మరియు అనేక రాష్ట్రాల్లో మహిళలపై దాడులు పెరిగాయని, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా 33 మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతోనే బీజేపీ, ఎన్డీయే నేతలు నిరాశతో రాహుల్ గాంధీ చిత్రపటాలు కాల్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని మతాలు, ప్రాంతాల అభ్యున్నతికి పనిచేస్తుందని, కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశం, మహిళలు అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు.

### వినతిపత్రం అందజేసిన వారిలో

ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇమాన్, తర్లుపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ హుస్సేన్, మార్కాపురం నియోజకవర్గ మైనార్టీ సెల్ ఛైర్మన్ షేక్ ఖాసిం వలి, మార్కాపురం పట్టణ కేకేసీ అధ్యక్షుడు నాగూర్ భాష మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఉన్నారు.

### రోడ్డు సేఫ్టీ నియమ నిభందనలు పాటించాలి : ఎస్ఐ శివరామయ్య



**త్రిపురాంతకం, ఏప్రిల్ 19,ప్రభాతావార్త**

మార్కాపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ సూచనల మేరకు ఆదివారం త్రిపురాంతకం మండలంలోని త్రిపురాంతకం నుండి రాజుపాలెం హైవే అప్రోచ్ రోడ్డు వద్ద, శ్రీ త్రిపురాంతకేశ్వరి అమ్మవారు టెంపుల్‌కి వెళ్లే ముఖ్యమైన జంక్షన్‌లలో కాన్వెక్స్ మిర్రర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామయ్య మాట్లాడుతూ ప్రజలు అందరూ కూడా తప్పనిసరిగా రోడ్డు సేఫ్టీ నియమ,నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రయాణించే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. తప్పనిసరిగా నియమ నిభందలు పాటిస్తూ వాహనాలు నడిపినట్లయితే కొంతవరకు ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా గమ్యం చేరవచ్చని ఎస్ఐ శివరామయ్య తెలియజేశారు.

# తిరుపతిలో ఏఐటీయూసీ మహాసభలు

- కార్మిక హక్కుల కోసం గోడ పత్రిక ఆవిష్కరణ





**మార్కాపురం, ఏప్రిల్ 19,ప్రభాతవార్త**

ఈ నెల 26 నుంచి 28 వరకు తిరుపతిలో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ యాసిన్ పిలుపునిచ్చారు. స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో జరిగిన సమావేశంలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. మహాసభల కోసం విస్తృత ప్రచారం జరుగుతోందని, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏప్రిల్ 26న తిరుపతిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ, లేబర్ కోడ్స్ రద్దు, సమాన వేతనాల కోసం పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. జిల్లా నలుమూలల నుంచి కార్మికులు భారీగా తరలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు అందె నాసరయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్కె ఖాసీం, ఉపాధ్యక్షులు యం రాములు, వై వెంకటరెడ్డి, వి వెంకటేశ్వర్లు, వెంకట శివయ్య, సహాయ కార్యదర్శులు దాసరి మల్లికార్జున, కిరణ్, సరళాదేవి, జిల్లా ఖజాంచి పి మస్తాన్ రావు, నాసర్ వలి, నాగయ్య, పుల్లమ్మ, దాసరి సునీత, సరళ తదితరులు పాల్గొన్నారు.

### మే 12 జరిగే హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

- హనుమాన్ శోభాయాత్ర కన్వీనర్ శిరసనగండ్ల శ్రీనివాసులు



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలో మే 12న జరుగనున్న హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హనుమాన్ శోభాయాత్ర కన్వీనర్ శిరసనగండ్ల శ్రీనివాసులు కోరారు. స్థానిక హనుమాన్ శోభాయాత్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాగవల్లి - శ్రీరామ చందన లిఖిత తమలపాకుల అర్చన కార్యక్రమంప్రతి గృహం నుండి భక్తులు పాల్గొనేలా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. భజన క్లబ్బింగ్ కార్యక్రమంసంకల్పం భక్తి మార్గ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా మార్కాపురంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హనుమాన్ శోభాయాత్ర కోర్ కమిటీ గోపాలుని హరిహరరావు, ఇమ్మడిశెట్టి వీరారావు, శాసనాల సరోజినీ, విజయరావు వెంకట నరసింహారావు, కంభం వెంకట రమణ రావు, దేవి శెట్టి చంద్రశేఖర్,పిన్నిక శివ యాదవ్, కడియం రామయ్య, మండ్ల వెంకటయ్య, గ్రందే సత్యనారాయణ, అల్లాకుల సుబ్బారావు, రెంటచింతల మధుసూదన్ రావు, బొంతల కృష్ణ, మట్టం శ్రీనివాసులు, ఇమ్మడి పిచ్చయ్య, పిల్లి సుబ్బారావు, మిరియాల వాసవి ప్రియ, ఈశ్వర్, గుంటక శేఖర్ రెడ్డి, పాలంకయ్య, గాలయ్య, పలువురు హనుమాన్ శోభా యాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో హాస్పిటళ్లకు ఫైర్ సేఫ్టీపై అవగాహన



**మార్కాపురం, ఏప్రిల్ 19,ప్రభాతవార్త**

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం మార్కాపురం పట్టణంలోని జననీ శ్వాస, ఆరోగ్య, శ్రీ బాలాజీ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సదస్సుల్లో భాగంగా హాస్పిటళ్లలో సంభవించే అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంపై అగ్నిమాపక అధికారులు వివరించారు. ముఖ్యంగా ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ ఇచ్చి, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు రోగులు, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి అనే అంశంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. అలాగే ఎలక్ట్రికల్ ఫైర్లను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవగాహన కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు, హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ పోస్టర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం అగ్నిమాపక అధికారి రేగలగడ్డ రామకృష్ణతో పాటు అగ్నిమాపక సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

### 22 నుంచి కంభంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**కంభం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

కంభం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 22వ తేదీ బుధవారం నుంచి మే నెల 2వ తేదీ వరకు నిర్వహించబడునని ఆలయ చైర్మన్ ఎం వెంకట సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 9గంటలకు విష్వక్సేన పూజ, సాయంత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, అనంతరం పుష్పయాగం, 23వ తేదీ ఉదయం 5:30కు సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 24వ తేదీ రాత్రి సింహ వాహనం, 25వ శేష వాహనం, 26వ తేదీ కల్పవృక్ష వాహనం, 27వ తేదీ హనుమంత వాహనం, 28వ తేదీ గరుడ వాహనం, 29న గజవాహనం, 30 తేదీ రథోత్సవం, మే 1వ తేదీ అశ్వ వాహనం, 2వ తేదీ ఉదయం చక్రస్నానం, ఉదయం 8 గంటలకు వసంతోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### చట్టాలపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి : ఎస్సై కోటేశ్వరరావు



**రాచర్ల ఏప్రిల్ 19 ,ప్రభాతవార్త**

చట్టాలపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాచర్ల ఎస్ఐ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని యడవల్లి పరిధిలోని రంగారెడ్డిపల్లి హైవేపై కొత్త చట్టాలపై ప్రజలకుఅవగాహన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ 2024 నుండి ప్రభుత్వం కొత్త చట్టాల్ని ప్రవేశపెట్టిందని, ఈ చట్టాల వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకోవాలని అన్నారు.శక్తి యాప్ వినియోగంపై అంగన్వాడి సిబ్బందికి మహిళలకు అవగాహన కల్పించారు.సమాజంలో చట్టం అందరికీ సమానమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు,అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# అదుపు తప్పి హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

- తప్పిన పెను ప్రమాదం







**యర్రగొండపాలెం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

పోరుమామిళ్ళ వైపు నుంచి ఆర్మూరు వైపు సజ్జల లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగం కారణంగాజాతీయ రహదారి 565 పక్కన ఉన్న మయూరి హోటల్‌ను ధ్వంసం చేసుకుంటూ లోపలికి దూసుకెళ్లింది. ప్రమాదం దాటికి హోటల్ ఆనవాళ్ళు కోల్పోయింది. ఆదివారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో ఆ ఘటన జరిగినట్లు చెబుతున్నారు. ఆ సమయానికి ఆ హోటల్ తెరవక పోవడంతో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం తప్పిందనే చెప్పాలి. ఇంకో అరగంట గడిస్తే ఆ కుటుంబం మొత్తం హోటల్ తెరిచేందుకు వచ్చి ఉండేవారని ఆ పరిసరాల వారు చెబుతున్నారు. ఈ ఘటనతో రోడ్డు పక్కన బయటి సిమెంట్ బల్లలు, అక్కడి వెంచర్ అర్చీతో పాటు రేకుల షెడ్డు కట్టెల పొయ్యి, క్యాష్ కౌంటర్ ధ్వంసమైపోయాయి. అక్కడి హోటల్‌లో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిపోయింది. దీంతో డ్రైవర్, క్లినర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ బీభత్సం సృష్టించడంతో రహదారి పైన వాహనాలునిలిచిపోయాయి. విషయంతెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తూ ముందు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ప్రమాదంతో హోటల్ యజమానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల డ్రైవర్లు వేగ నియంత్రణ పాటించాలని ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, అధికారులను కోరుతున్నారు.

### పోస్టల్ ఏజెంట్ల మార్కాపురం జిల్లా అధ్యక్షులుగా రాచపూడి



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

పోస్టల్ ఏజెంట్ల మార్కాపురం జిల్లా అధ్యక్షులుగారాచపూడి నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.స్థానిక గాంధీ బజార్‌లోని కళ్యాణ రామస్వామి దేవస్థానంలో మువ్వల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగిన పోస్టల్ ఏజెంట్ల సమావేశంలోనూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మార్కాపురం జిల్లా పోస్టల్ ఏజెంట్ల గౌరవఅధ్యక్షులుగా గోనుగుంట్ల విశ్వనాథం ప్రధాన కార్యదర్శిగా దేవి శెట్టి రామ శేఖర్,కోశాధికారిగా జూటూరి సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులుగా మువ్వల వెంకటేశ్వర్లు, సముద్రాల రవికుమార్,పిసుధీర్,జాయింట్ సెక్రటరీగా కేవీ హరినాథ్, మరో 9 మందిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బుద్దా వెంకన్నను ఘనంగా సన్మానించిన దారపనేని



**పామూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ ఇటీవల పార్టీలో క్రియాశీలకంగా కష్టపడిన వారికి, మెరుగైన సేవలందించిన నాయకులకు జాతీయ స్థాయిలో పదవులను ప్రకటించిన తెలుగుదేశం పార్టీజాతీయఅధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశంపార్టీసీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నకు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్నకు అత్యంత సన్నిహితులు, శ్రేయోభిలాషులు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఆదివారం విజయవాడలోని బుద్దా వెంకన్న నివాసంలో పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. మా మిత్రులు బుద్దా వెంకన్న భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. పార్టీలో బుద్దా వెంకన్నకు సముచితస్థానంకల్పించిన తెలుగుదేశంపార్టీ జాతీయఅధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసులకు దారపనేని కృతజ్ఞతలు తెలిపారు. తూర్పుకోడిగుడ్లపాడు, పోతవరం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు చెనికల నాగేశ్వరరావు, బుద్దా వెంకన్నను సన్మానించిన వారిలో ఉన్నారు.

## రేగలగడ్డ వారి వివాహ మహోత్సవానికి దద్దాలకు ఆహ్వానం



**పామూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పామూరు మండలం కొత్తపల్లి, సీఎస్‌పురం మండలం ఆర్కేపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు రేగలగడ్డ నాగరాజు, దుద్దుకూరి శ్రీను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 29వ తేదీ జరుగు రేగలగడ్డ నాగరాజు అన్న కూతురు మేఘన వివాహ మహోత్సవానికి ఆయనను ఆహ్వానించి, ఆహ్వాన పత్రిక అందజేశారు.

## నెమలయ్యకు నివాళులర్పించిన ఆకుపాటి



**పామూరు, ఏప్రిల్ 19 ,ప్రభాతవార్త**
జిల్లా కేఆర్ అడ్మిన్ రాంమోహన్ తండ్రి రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కి.శే స్వర్గీయ కొంకాల నెమలయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ తదితర మిత్రులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## దశాబ్దాల సమస్యకు ఒక రోజులోనే పరిష్కారం

**- నిన్న ప్రజా దర్బార్‌లో అర్జీ.. నేడు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**

**- ప్రజాసమస్యలపై తక్షణ స్పందనలతో గూడూరి ఎరిక్షన్‌బాబుకు ప్రశంసలు**





**పెద్దదోర్నాల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పెద్దదోర్నాల ఎస్సీ పాలెంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ సమస్యకు ఒక్క రోజులోనే పరిష్కారం లభించడం స్థానిక ఎస్సీ కాలనీ వాసుల్లో ఆనందాన్ని నింపింది. శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎస్సీ కాలనీ వాసులు తమ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ అంతరాయాలతో ఇబ్బంది పడుతున్నామని గూడూరి ఎరిక్షన్‌బాబు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యను ఆలకించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టించారు. ఫలితంగా ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి చెట్లను తొలగించి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో సురక్షిత ప్రదేశంలో ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కానీ సమస్యను కేవలం ఒక రోజులోనే పరిష్కరించడం పట్ల కాలనీ వాసులు గూడూరి ఎరిక్షన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఆయన తీరును స్థానికులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య మాట్లాడుతూ ఇన్నాళ్లుగా ఎదురు చూస్తున్న సమస్యను ఒక్క రోజులో పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది. గూడూరి ఎరిక్షన్‌బాబు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను కాదు లేదు అనకుండా వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడం పట్ల గూడూరి ఎరిక్షన్‌బాబుకు రుణపడి ఉంటామని కాలనీ వాసులు తెలపడం శుభ పరిణామం అన్నారు. ఈ పరిణామం ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధుల చొరవ ఎంత అవసరమో మరోసారి చాటి చెప్పింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, ఎస్సీ నాయకులు చంటి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో స్వర్ణంతో మెరిసిన గాత్రం ఉమా

**- 45 ప్లస్ విభాగంలో లాంగ్‌జంప్ ట్రిపుల్ జంప్‌లలో స్వర్ణం**




**వేటపాలెం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
వేటపాలెం గ్రామానికి చెందిన గాత్రం ఉమామహేశ్వరరావు ప్రపంచ స్థాయిలో సత్తా చాటాడు. వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కాంపిటేషన్ 45ప్లస్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఈపురుపాలెం నందు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమా 2026జనవరిలో హైదరాబాద్ నందు జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లలో స్వర్ణ పతకాలను సాధించి థాయిలాండ్‌లో జరగనున్న వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. అనంతరం ఏప్రిల్ 17 నుండి 19వ తేదీ వరకు థాయిలాండ్‌లో నిర్వహించిన పోటీలలో ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లలో స్వర్ణ పతకాలను కైవసం చేసుకొని విజేతగా నిలిచాడు. చిన్ననాటి నుండి ఆటలపై ఆసక్తి గల ఉమా ఎప్పుడు నిరుత్సాహపడలేదు. 45 విభాగంలో సైతం బంగారు పతకాన్ని సాధించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. దీంతో వేటపాలెం గ్రామంలోని ఉమా ఇంటి వద్ద సందడి నెలకొంది. ప్రపంచ స్థాయిలో మెరిసి, ఎంతో మంది యువతకు ఉద్యోగాల సమయంలో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు బాట వేసిన తమ మిత్రుడు ఉమా ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడిచినందుకు స్నేహితులు, అభిమానులు అభినందనలతో సత్కరించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విజేతకు అభినందనలు తెలియజేశారు.

## చీరాల రామాపురం బీచ్‌లో పరామోటర్ ఎయిర్ సఫారి ప్రారంభం

**- పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, నూకసాని, మద్దులూరి, సలగల**





**చీరాల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
చీరాల మండలం రామాపురం బీచ్ వద్ద విహాంగ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరామోటర్ ఎయిర్ సఫారిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, విహాంగ్ అడ్వెంచర్స్ కెప్టెన్ సూర్య తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చొరువతో జిల్లాలోని బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పోలీసు శాఖ తరుపున సముద్ర తీర పరిసర ప్రాంతాల్లో భద్రతాపరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సూర్యలంక నుండి పొట్టి సుబ్బయ్యపాలెం వరకు యాత్రికులకు రక్షణ కల్పించే దిశగా, రోడ్డు ప్రమాదాలను నివారించే లక్ష్యంతో తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించడం, ఏటీవీ వాహనాల ద్వారా గస్తీ తిరగడం వంటి చర్యలను ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు జిల్లా వాసులతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తున్నారని, ముఖ్యంగా పండుగలు, సెలవు దినాల సందర్భంగా మరింత ఎక్కువ సంఖ్యలో సందర్శకులు వస్తున్నారని పేర్కొన్నారు. వీరందరికి తగిన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధిలో పోలీసు శాఖ పాత్ర ముఖ్యమని పేర్కొంటూ, త్వరలో పరామోటర్, జెట్ స్కీ నిర్వాహకులతో భద్రతా అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సంయుక్తంగా యాత్రికులకు మెరుగైన భద్రతా సేవలు అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

## దర్శిలో చీఫ్ అండ్ బెస్ట్ సెలూన్ షాపు

## ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్



**దర్శి ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
దర్శిలోని పొదిలి రోడ్డులో గల శేఖర కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన చీఫ్ అండ్ బెస్ట్ సెలూన్ షాపు ప్రారంభించిన టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి సొసైటీ అధ్యక్షులు కలవకొలను చంద్రశేఖర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా సెలూన్ షాపు యజమాన్యం ప్రారంభోత్సవానికి విచ్చేసిన డాక్టర్ లలిత్‌ని, ప్రజా ప్రతినిధులను సత్కరించారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన





**దర్శి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆరో రోజు కేంద్రాధికారి సీహెచ్ జాలి ఆధ్వర్యంలో సిబ్బంది మీనాక్షి హాస్పిటల్, సాయినర్సింగ్ హోమ్, గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లి అక్కడ ఉన్నటువంటి యాజమాన్యానికి, సిబ్బందికి అక్కడికి వచ్చినటువంటి ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు ఏర్పడినప్పుడు వాటిని ఏ విధంగా నివారించాలి వారికి డెమో ద్వారా చేసి చూపించారు. ఈ కార్యక్రమం నందు డాక్టర్లు, సిబ్బంది అక్కడ ఉన్నటువంటి ప్రజలు పాల్గొన్నారు.

## విజయవాడ రాష్ట్ర మహిళా చైతన్య సదస్సుకు తరలిన మహిళా బాధ్యులు



**దర్శి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
ఆదివారం విజయవాడ ఎంజీ రోడ్డులో రాష్ట్రస్థాయి మహిళా చైతన్య సదస్సుకు దర్శి డివిజన్ నుంచి యూటీఎఫ్ మహిళా బాధ్యులు విజయవాడకు తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం మహిళా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో, ఉద్యమాల్లో మహిళల పాత్ర పెరగాలి, హక్కుల కొరకు పోరాటం చేయాలి, పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలి, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఆదివారం రాష్ట్ర స్థాయి మహిళా చైతన్య సదస్సుకి దర్శి మండలం నుండి మండల సహాధ్యక్షురాలు ఎల్ఆర్ స్రవంతి, బి.అరుణకుమారి, ముండ్లమూరు సుమలత, డి.అంజలి, దొనకొండ షేక్ గౌసియా బేగం, పల్లవి, దీనమ్మ, డి.స్రవంతి, డి.తిరుపతమ్మ, భ్రమరాంబాదేవి, మీనిగ శ్రీను, చిన్న మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు పోసి మిర్చి కుప్పలకు నిప్పంటించిన గుర్తు తెలియని దుండగులు

**- వై.చెర్లోపల్లిలో రాత్రి దుర్ఘశ్య - రైతు కుటుంబానికి అపార నష్టం**









**పెద్దదోర్నాల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం వై.చెర్లోపల్లి పొలంలో ఆరబెట్టిన మిర్చి కుప్పలను పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన కలకలం రేపింది. రైతు కష్టపడి పండించిన మిర్చి మంటల్లో దగ్ధమై కాలిపోయింది. శనివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో వై.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కటారు చెంచయ్యకు చెందిన 20క్వింటాళ్ల మిర్చి దగ్ధమై 5 లక్షల మేర నష్టం వాటిల్లింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం. పొలంలో ఆరబెట్టిన మిరపకుప్పలకు గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించడంతో మిర్చి మొత్తం మంటల్లో కాలిపోయింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు కాలుతున్న మిర్చిని కొంత పక్కకు తీయగలిగారు. కష్టపడి పండించిన పంట ఒక్క సారిగాఅగ్నికి ఆహుతి కావడంతో రైతు కుటుంబం తీవ్రవిషాధంలో మునిగిపోయింది. కౌలుకు తీసుకొని కష్టపడి పండించిన మిర్చి కాలిపోవడంతో రైతు భార్య దు:ఖానికి అవధులు లేకుండా పోయాయి. రాత్రి 8.30గంటలకు పొలంలోనే ఉన్నామని తాము భోజనం చేసుకొని తిరిగి వద్దామనుకునే లోపలనే గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టారని దు:ఖ సాగరంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఎస్సై ఎస్.వెంకట రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ దారుణ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొనగా బాధిత రైతుకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఘనంగా పొదిలి బ్రాంచ్ ద్వితీయ వార్షిక ఏజీడీఎస్ మహాసభలు

**- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఏర్పాటు**



**కొనకనమిట్ల, ఏప్రిల్ 19,ప్రభాతవార్త**
మండలంలోని పెద్దారికట్ల సబ్ పోస్టాఫీసు పరిధిలోని నందన మారెళ్ళలోని కాశీనాయన సత్రం నందు పొదిలి బ్రాంచ్ ద్వితీయ వార్షిక ఏజీడీఎస్ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఏపీ సర్కిల్ సెక్రటరీ వై.మర్రిరెడ్డి, సర్కిల్ అధ్యక్షులు పి.కృష్ణ యాదవ్, ఆలిండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఏపీ సర్కిల్ మహిళా అధ్యక్షురాలు ఏ.శైలజ పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఏర్పాటు :**
మార్కాపురం ఏజీడీఎస్ డివిజన్‌కార్యదర్శి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచ్ అధ్యక్షులుగా అంజయ్య, కార్యదర్శిగా డీవీ రమణయ్య, కోశాధికారిగా ఎస్.శివ కార్తీక్, ఆర్గనైజ్ సెక్రటరీగా కే.శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులుగా అమర వెంకటేశ్వర్లు, డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా కళ్యాణిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి డివిజన్ నుంచి పీ 3 అసిస్టెంట్‌సర్కిల్ సెక్రటరీ రమణారెడ్డి, పీ 3 డివిజన్ సెక్రటరీ ఏరవి, పీ 4 అధ్యక్షులు సత్యనారాయణ, సెక్రటరీ ఎం.శ్రీనివాసులు, అసిస్టెంట్ బీవీ ప్రతీష్, పాల్గొన్నారు.

## వేసవిలో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి




**లింగసముద్రం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్సై రాంబాబు సూచించారు. లింగసముద్రం మండలంలోని గ్రామాల్లో సరదా కోసం పిల్లలు, యువకులు కుంటలు, చెరువులు, కాలువలు, బావుల వద్దకు వెళ్లడం ఈతకు దిగడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా పెద్దల పర్యవేక్షణ లేకుండా నీటి వనరుల దగ్గరికి వెళ్లకూడదని సూచించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆయన కోరారు. ఇంటి పరిసరాల్లోనే ఆడుకునేలా చూడాలని, అనుమానం కలిగించే పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని సూచించారు. ఈతకు వెళ్లే సమయంలో సరైన రక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశముందని తెలిపారు. అలాగే వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే కారణంగా పిల్లలు డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశముందని, తరచుగా నీరు తాగించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నా వేళల్లో బయటకు వెళ్లకుండా చూడాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై రాంబాబు పేర్కొన్నారు.

## శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



**అద్దంకి, ఎఫ్రియల్ 19, ప్రభాతవార్త**
మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అద్దంకి మండల కమిటీ, అద్దంకి మండలం, చక్రాయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కొటికలపూడి శ్రీనివాసరావు కుటుంబం సభ్యులకు 5 వేల రూపాయలు అధ్యక్షుడు పేరం సుధాకర్ రెడ్డి, సెక్రెటరీ గోనుగుంట శ్రీనివాసరావు, కోశాధికారి బొడ్డు నాగార్జున, సభ్యులు వినకొండ వెంకట సుబ్బారావు అందజేశారు.

## ఉగ్ర స్పందనతో రైతుకు ఊపిరి .. కరెంట్ షాక్ బాధితుడికి ఉచిత చికిత్స



**పీసీపల్లి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలం తలకొండపాడు గ్రామంలో విద్యుత్ ప్రమాదానికి గురైన ఓ రైతుకు సమయానికి అందిన సహాయంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన పోలినేని మాలకొండయ్య కుమారుడు నరసింహారావు శనివారం ఉదయం ఉదయం తన వ్యవసాయ పొలంలో కరెంటు మోటారు వద్ద ఫీజు వేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే కనిగిరి శాసనసభ్యుడు, ఒంగోలు పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తక్షణమే స్పందించారు. బాధితుడికి అవసరమైన వైద్యం అందించేందుకు వెంటనే లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయించారు. దీంతో కుటుంబానికి ఎలాంటి ఆర్థిక భారం లేకుండా శస్త్ర చికిత్స నిర్వహించబడింది. తదుపరి రోజే ఎమ్మెల్యే ఉగ్ర ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి వైద్యుల నుంచి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. సమయానికి స్పందించి ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకున్నందుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# కాలిపోతున్న దొడ్డికొండ



**బల్లికురవ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**
ముక్తేశ్వరంపంచాయతీ పరిధిలోని దొడ్డికొండ కు ఆకతాయిలు, ఆదివారం సాయంత్రం నిప్పు అంటించడంతో కొండమీద వృక్షాలు కాలిపోతున్నాయి. పంచాయతీ పరిధిలోని సూరేపల్లి, ముక్తేశ్వరం, ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీ పరిధిలో 200 ఎకరాలకు పైగా ఈ కొండ విస్తీర్ణం వ్యాపించి ఉంది. ముక్తేశ్వరం వైపుగా కొండల్లోని వృక్షాలు కాలిపోతూ మంటలు వ్యాపిస్తున్నాయి. వర్షాకాలంలో గోవులకు, ఇతర పశు సంపదకు ఈ కొండ పరిధిలో పశుగ్రాసం విరివిగా లభిస్తుంది. భానుడి ప్రతాపం కారణంగా కొండమీద చెట్లు ఎండిపోయాయి. ఆకతాయిలు ఎలా కాలుతుందో చూద్దాం అంటూ అగ్నిని రాజేయడంతో అందులోని మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఆయా గ్రామ పంచాయతీలలోని అధికారులు ఆకతాయిలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**కందుకూరు ఏప్రిల్ 19,ప్రభాతవార్త**
నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు 70వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇందులోబాగంగా ఆదివారం ఆయన నెల్లూరులోని ఎంపీ స్వగృహంలో శాలువాతో సత్కరించారు. ఎంపీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించాలన్నారు. రాజకీయ చదరంగంలో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్లమూడి సురేష్, కందుకూరు మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## పదవి విరమణ సభలో ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు ఏప్రిల్ 19,ప్రభాతవార్త**
సైన్స్ టీచరు ఆకురాతి బలరామకృష్ణ పొన్నలూరు మండలం ముప్పాళ్లలో పనిచేస్తూ ఇటీవల పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనకుకందుకూరు జనార్ధనస్వామి కళ్యాణ మండపంలో సన్మానసభ ఏర్పాటుచేశారు. ఈ సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిధిగా పాల్గొని బలరామకృష్ణ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చాడన్నారు. విద్యాబోధనలోనూ సామాజికసేవకార్యక్రమాల్లోనూచ బలరామకృష్ణ చురుకైన పాత్రపోషించేవారన్నారు. ఈయన సేవలు గుర్తించిన ప్రభుత్వం ఈయనకు జిల్లా మరియు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు బహుకరించినట్లు తెలిపారు. అనంతరం బలరామకృష్ణను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. ఆయన శేషజీవితం సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు జి.వి.మాల్యాద్రితోపాటు పలువురు ఉపాధ్యాయులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ కొండయ్యకు సన్మానం



**కందుకూరు ఏప్రిల్ 19,ప్రభాతవార్త**
కందుకూరు పంచాయతీరాజ్ విభాగంలో పనిచేస్తున్న కొచ్చర్ల మాలకొండయ్యను ఇటీవల కందుకూరు డివిజన్ ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా ప్రకాశం జిల్లా కమిటి నియమించింది. ఇందుకు గౌరవసూచకంగా ఆయనను కందుకూరు రజకసంఘం ఆధ్వర్యంలో పలువురు నేతలు ఘనంగా సన్మానించారు. పడమట రజకపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో రజకసంఘ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు పూర్వపు ఎంపీడీవో కె.మాలకొండయ్య, కందుకూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తలమంచి బ్రహ్మయ్య, రజకసంఘమాజీ ప్రధానకార్యదర్శి బీమవరపు బుచ్చయ్య ఉపాధ్యాయ సంఘనేతలు వెంకటేశ్వర్లు, వైవి కోటయ్య, కాశీరత్నం, కల్లగుంట శ్రీనివాసులు, ట్రజరర్ వెంకటరావు, ఉపాధ్యక్షుడు పాకల మాల్యాద్రి, రిటైర్డ్ ఎంప్లాయి కొచ్చర్ల శ్రీనివాసులు, కొచ్చర్ల మాల్యాద్రి (కరెంటు) కామేపల్లి రమణయ్య, మదు తదితరులు మాలకొండయ్యను ఘనంగ సత్కరించారు.

## కందుకూరులో రూ.20 వేల ఇంజన్ ఉచితం



**కందుకూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త**
కందుకూరు డా॥కోటారెడ్డి వైద్యశాలలో మోకాళ్ల నొప్పులకి సంబందించిన రూ.20వేల విలువైన ఇంజన్ ఉచితంగా ఇవ్వనున్నట్లు వైద్యశాల నిర్వహకులు వైద్యనిపుణులు డా॥ సాకేత్‌రెడ్డి తెలిపారు. వెన్నెముక, కీళ్లమార్పిడి శస్త్రచికిత్సలతోపాటు విరిగిన ఎముకలకు ఇంపార్టెడ్ క్వాలిటీ ఇంప్లాంట్స్‌తో ఎన్టీయార్ వైద్యసేవలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

**సీఎంసీ వెల్లూరుకు ధీటుగా :**
ఇండియాలో ప్రధాన వైద్యశాలలో ఒకటైన తమిళనాడులోని వెల్లూరు క్రిష్టియన్ మెడికల్ కాలేజి లాబ్ నివేదికల ప్రమాణాలకు అనుగుణంగా ఇక్కడ లాబ్ నివేదికలు ఉన్నాయన్నారు. 7-పార్ట్ సీబీసీ సిస్టమ్ ద్వారా రక్తసంబంద వ్యాధులను, ఐపీఎఫ్ ద్వారా డెంగూ వ్యాధిప్లేట్‌లెట్స్ పరిస్థితిని ముందుగా అంచనావేయవచ్చన్నారు. సీఎల్ఐఎ టెక్నాలజితో హార్మోన్ పరిస్థితి ఖచ్చితత్వాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఏబీసీ, బయోకెమిస్ట్రీ యూరిన్ తదితర వ్యాధులను పసిగట్టవచ్చని తెలిపారు. మోకాలి నొప్పులకు రూ.20వేల ఖరీదైన ఇంజెక్షన్ ఉచితంగా ఇస్తామన్నారు. ఇందుకు అవసరమైన అత్యాధునిక వైద్యపరికరాలు, సుశిక్షితులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారని డా॥సాకేత్‌రెడ్డి వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

